క్లుప్తంగా

రెడ్డి సేవా సమితి వార్షిక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న లెక్కల కొండారెడ్డి

కడప కల్చరల్ : కడప నగరం రాజీవ్‌మార్గంలో గల రెడ్డి హాస్టల్‌లోరెడ్డి సేవా సమితి 24వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ సమితి గతంలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. రాబోయే కాలంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి 2023–24 సంవత్సర ఆదాయ, వ్యయ వివరాలను తెలియజేశారు. బడ్జెట్ అంచనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు, రెడ్డి ప్రముఖులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెడ్డికుమారి, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఎస్‌ఐ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్‌ను వాడాలని వన్‌టౌన్ ఏఎస్‌ఐ ఎస్‌పీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కడప నగర ట్రంకు రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి అనే కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వన్‌టౌన్ ఏఎస్‌ఐ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పుకోవచ్చు అని ఆయన అన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ మహబూబ్ ఆలీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. దాదాపు రూ.3 వేల విలువ చేసే షుగర్, కొలస్ట్రాల్, ఈసీజీ, న్యూరోపతి తదితర పరీక్షలను రోగులకు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహార అలవాట్లు, తగిన వ్యాయామం చేసుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటే మధుమేహం వ్యాధికి దూరంగా ఉండవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, సయద్‌నూర్, సాహిద్ పఠాన్, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీష రెడ్డి, మౌలని, సువర్ణలతోపాటు మెడికల్ రెప్స్ పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి చిన్నారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. డ్యాన్స్ మాస్టర్ విజయశాంతి ఆధ్వర్యంలో చిన్నారులు పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. సందర్శకులు చిన్నారులను పదేపదే తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు. శిల్పారామం ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పుష్పగిరిలో ఏఎఫ్‌యూ వీసీ



చెన్నకేశవస్వామి ఆలయంలో ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ : పుష్పగిరి పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పుష్పగిరి స్థలపురాణం, విశిష్టతను వివరించారు. అనంతరం పూజారులు వేదాశీర్వాదం ఇచ్చారు. వైస్ చాన్సలర్ ఆలయంలోని అద్భుతమైన శిల్పకళా సంపదను పరిశీలించారు. ఈయన వెంట వై.అనిల్‌కుమార్ ఉన్నారు.

అమ్మో.. ధరలు పెరిగాయమ్మో..!



శాకంబరిగా అమ్మవారు (ఫైల్)



మార్కెట్‌లో కూరగాయలు

- శాకంబరి అలంకారానికి ఇబ్బందులు
- ప్రభావం చూపిస్తున్న కూరగాయల రేట్లు

కడప కల్చరల్ : 'ఏమమ్మా పచ్చిమిర్చి కొరక్కుండానే నీ ఘాటుకు ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు'.. అన్నది టమాట.

'నా సంగతి అటుంచు.. నీవేం తక్కువ! చూడటానికి ఎర్రగా, బుర్రగా ఉన్నా నీ ధర గురించి తెలుసుకోగానే ప్రజలు జడుసుకుంటున్నారు' అని దెప్పి పొడిచింది పచ్చిమిర్చి.

ప్రస్తుతం జిల్లాలోని కూరగాయల మార్కెట్లలో ధరల స్థితి ఇలా ఉంది. జూన్ మధ్య నుంచి కూరగాయల ధరలు ఎన్నడూ లేని విధంగా తారాస్థాయికి చేరాయి. నెలాఖరుకు ధరలు తగ్గుతాయని ప్రజలంతా భావించినా ఆ పరిస్థితి కనిపించలేదు. జూలైలో కూడా అనుకున్నంత మేర వర్షాలు కురవకపోవడం, అడపాదడపా కురిసిన వానల కారణంగా తోటల్లో కూరగాయలు కుళ్లిపోవడంతో ధరలు ఆకాశాన్నంటాయి. అప్పుడప్పుడు టమాట, పచ్చిమిర్చి లాంటివి ఓ పది రూపాయలు పెరిగినా ఒకటి, రెండు రోజుల్లో సాధారణ స్థితికి చేరేవి. ఏటా ఆషాఢ మాసంలో వర్షాలు కురుస్తుండేవి గనుక కూరగాయల ధరలు అందుబాటులో ఉండటంతో శాకంబరి అలంకారాలకు కూరగాయలను సులభంగా సేకరించేవారు. భక్తులు కూడా తమవంతుగా కొద్దిమేర కూరగాయలను అందజేసేవారు.

కళ్లు 'పచ్చ' బడుతున్నాయి

మార్కెట్‌లో ఇటీవల కూరగాయలు, ఆకుకూరల ధరలు వింటే కళ్లు బైర్లు కమ్మి పచ్చబడుతున్నాయి. పెరిగిన ధరల కారణంగా శాకంబరి అలంకారంలో కూరగాయల సేకరణ ఇబ్బందిగా మారింది. కూరగాయల దాతలను ఎక్కువ మందిని ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కొన్ని చోట్ల దాతలు ఐదారుగురు కలిసి కూరగాయలను సేకరిస్తున్నారు. ఇదివరకు లాగా అన్ని అమ్మవారి ఆలయాల్లోనూ శాకంబరి అలంకారం చేయడం లేదు. ఒకవేళ నిర్వహించినా అతి తక్కువ కూరగాయలతోనే అమ్మవారి చిన్న విగ్రహానికి అలంకారం చేసి కార్యక్రమాన్ని నిర్వహించామని తృప్తి పడుతున్నారు. మరికొన్ని చోట్ల దేవతల కోసం కదా.. ఎంత ఖర్చయినా ఏడాదికి ఒకసారే కదా అంటూ భక్తులు ముందుకు వస్తూనే ఉండటం విశేషం.

ఉపశమనం

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు బాగా పెరిగి ఉండడం తెలిసిందే. దుంప కూరలు మేలు రకం కిలో రూ.60–120 వరకు ఉండగా, టమాట మంచి రకం రూ. 80–100, పచ్చిమిర్చి రూ.60–80గా ఉంది. ఉల్లిపాయలు రూ.40, ముల్లంగి, క్యారెట్ రూ.80–100గా ఉన్నాయి. బీన్స్, బీర కూడా రూ.60–100పై మాటేగానే ఉంది. వంకాయలు, మట్టికాయలు రూ. 40–60గానే విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్, క్యాబేజీ రూ.50–80గా ఉంటోంది. ఆకుకూరలు సైతం అమ్మో అనిపిస్తున్నాయి. రూ. 10లకు ఇస్తుండిన కొత్తిమీర కట్ట రూ.25–30 ఉండగా, గోంగూర, తోటకూర కూడా ఉడికిపోతూనే ఉన్నాయి. దీంతో శాకంబరి అలంకారానికి అమ్మవారికి కూరగాయలు సమర్పించే వారిలో పలువురు ఆ ఆలోచన మానుకుని ఇతర ప్రసాదాల సామగ్రిని అందజేసి తృప్తి పడుతున్నారు.

పాలకొండ క్షేత్రంలో స్వచ్ఛభారత్



ఆలయ నడక మార్గంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న అధికారులు, భక్తులు

కడప కల్చరల్ : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగర శివార్లలోని పాలకొండ క్షేతంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పాలకొండ క్షేత్రంలో నడక మార్గం నుంచి శ్రీ పాలకొండరాయస్వామి ఆలయం వరకు పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, భక్తుల నడకకు అనుకూలంగా నడక మార్గాన్ని శుభ్రపరిచారు. అలాగే పాలకొండరాయస్వామి ఆలయ పరిసరాలలో ఉన్నటువంటి చిన్న కోనేరు, పెద్ద సెలయేరు, ఆలయ చుట్టుపక్కల పరిసరాలలో ఉన్నటువంటి అపరిశుభ్ర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణపై ప్రతి పౌరుడు, భక్తుడు సామాజిక బాధ్యతగా భావించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన శ్రీ భువనేశ్వరి మాత సేవా సమితి సేవకులు, ఆలయ అర్చకులు యోగేశ్వరశర్మ, ఈవో శ్రీధర్, స్వామివారి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యం చేరుకోవాలి



విద్యార్థినికి నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : విద్యార్థులు కష్టపడి చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సూచించారు. ఆదివారం కడప నగరంలోని వాసవీ హాస్టల్‌లో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచిత నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయన్నారు. విద్యార్థులను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు సతీష్, బెస్తవేముల రామమహేష్, నారంశెట్టి భవాని ప్రసాద్, విజయ, నిరంజన్‌తోపాటు వాసవీ హాస్టల్ కమిటీ సభ్యులు, వాసవీ మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. ఆదివారం ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఫిమ్స్) కళాశాల సెక్రటరీ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో వెల్లటూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్ పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కంటి వ్యాధులకు సంబంధించి వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే వైద్య సేవలు పొందాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఫిమ్స్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో శాకాహార ర్యాలీ



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు, ప్రముఖులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పోలీసు పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక వీధుల మీదుగా సాగింది. ర్యాలీలో ధ్యానులు, నగర ప్రముఖులు పాల్గొని శాకాహారం అమృతాహారమని, శ్రేష్టమైన ఆహారమని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రెసిడెంట్ జీవీఎస్ రెడ్డి, ధ్యానులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు డాక్టర్ ఊర్మిళాదేవి, గజ్జల రామసుబ్బారెడ్డి, జీవీఎస్ రెడ్డి, ఎంసీ ఓబయ్య, పి.రమణ, సంజీవరాజు, పి.నారాయణరెడ్డి, మురళి, ప్రసాద్, ప్రభాకర్, శర్వాణి, శ్యామల, సరోజ తదితరులు పాల్గొన్నారు.

కడపలో పోలీసుల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప నగరంలో కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. సుధాకర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కడప నగరంలోని అన్ని కూడళ్లు, శివార్లలో రాత్రిపూట అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని ఆకతాయిలను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. బ్లూకోల్ట్స్ 20 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిచేత ముమ్మరంగా గస్తీ నిర్వహించారు. వయోజనులు, మహిళలు, వాకింగ్ చేసే ప్రాంతాలలో మార్కెట్, బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల వద్ద వాహనాల్లో గస్తీ తిరుగుతూ అనుమానాస్పదంగా వున్న వారిని విచారిస్తున్నారు. జిల్లాను నేర రహిత జిల్లాగా చేయాలన్నదే జిల్లా ఎస్పీ ఆదేశాలతో పలు చర్యలకు పోలీస్ యంత్రాగం శ్రీకారం చుట్టింది.

ప్రవక్తల త్యాగాలు చిరస్మరణీయం

కడప కల్చరల్ : ప్రవక్తలైన హజరత్ ఇమామ్ హసన్, హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని హజరత్ కంబల్ పోష్ దర్గా పీఠాధిపతి సయ్యద్ అర్షద్ ఇక్బాల్ ఖాద్రి సాహెబ్ తెలిపారు. మొహర్రం మాసం సందర్భంగా ఆదివారం కడప నగరం దండులోని కంబల్ పోష్ నగర్‌లో వెలసిన హజరత్ కంబల్ పోష్ దర్గాలో యాదే హుస్సేన్ పేరుతో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పవిత్ర మాసం ప్రాధాన్యత, అమరులైన వారి జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్థానె-యే-మురాదియ పీఠాధిపతి సోదరుడు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా అక్మల్ పీరా మురాది సాహెబ్, గుత్తికి చెందిన మద్రసా ఏ ఇస్లామియా సుహార్వర్దియ ఫౌండర్ సయ్యద్ షా అన్వర్ పాషా హుసేని సుహార్వర్ది, మాజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా, ముస్లిం ప్రముఖులు, ముస్లింలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌస్‌నగర్‌లో పసుపుమండీ వద్ద ఆదివారం సాయంత్రం నలుగురు జూదరులను సీఐ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. రూ. 20,150 నగదు, పేక ముక్కలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీపీ నాగేంద్ర, ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని బాలుర హాస్టల్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఎనిమిది నెలలుగా మెస్ చార్జీలు అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్, కృష్ణ, తేజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల్లో అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగలరెడ్డి, కడప జిల్లా శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్ కోరారు. పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రాంటును విడుదల చేయాలని వారు పేర్కొన్నారు. అలాగే బోధనేతర పనుల నిమిత్తం ఉన్నత పాఠశాలలకు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు. దీంతోపాటు అవసరం ఉన్న చోట బోధన సిబ్బందిని నియమించడంతోపాటు యాప్‌ల భారంపై సమీక్షించాలని డిమాండ్ చేశారు.

శివానందపురంలో వసతులు కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని శివానందపురంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. కాలనీలో వసతులు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం శివానందపురం, ఎస్టేట్ పరిసర ప్రాంతాలలో తన బృందంతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మడగలం ప్రసాద్, విజయ్ కుమార్, రమేష్, వినోద్, అంకయ్య, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

'కక్షగట్టి వాచ్‌మెన్‌గా తొలగించారు'

కడప రూరల్ : తాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వాడినని, కక్షగట్టి వాచ్‌మెన్ విధుల నుంచి తొలగించారని ఎం.సుధాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బద్వేలులోని శ్రీ కన్యకా పరమేశ్వరీ హైస్కూలులో తాను వాచ్‌మెన్‌గా పని చేసేవాడినని తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు గౌరవ వేతనం కూడా ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేశారన్నారు. తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడికి న్యాయం చేయకపోతే ఆందోళన చేపడతామని దళిత నేతలు జేవీ రమణ హెచ్చరించారు.

శిలాఫలకంలో అచ్చుతప్పులు

- కడప కోటిరెడ్డి జనన, మరణాలు తప్పుగా నమోదు
- అధికారుల నిర్లక్ష్యంపై పలువురి ఆగ్రహం



కడప కోటిరెడ్డి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కడప కోటిరెడ్డి విగ్రహం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ మంత్రి, చారిత్రాత్మక శ్రీబాగ్ ఒప్పంద సమావేశానికి అధ్యక్షత వహించి, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కారకుడైన నిష్కళంక దేశభక్తుడు కడప కోటిరెడ్డికి జిల్లా అధికారులు తీరని అపచారం చేశారు. ఆయన 1981 జనవరి 27వ తేదీన కడపలో కన్నుమూశారు. కానీ అధికారులు మాత్రం 1957 జనవరి 27వ తేదీ చనిపోయినట్లు కడప నగరంలోని ఆయన విగ్రహం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయడం దిగ్భ్రమ కలిగిస్తోంది. అలాగే నాటి కడప జిల్లాలో భాగంగా ఉన్న మదనపల్లె తాలూకాలోని కోటిరెడ్డిగారిపల్లెలో 1887 అక్టోబరులో కోటిరెడ్డి జన్మించినట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. అయితే ఇవేమీ పరిశీలించని అధికారులు శిలాఫలకంపై 1872 అక్టోబరులో జన్మించినట్లు నమోదు చేశారు. ఆయన జనన, మరణాలను శిలాఫలకాలపై తప్పుగా నమోదు చేశారు. కోటిరెడ్డి గురించి బాగా తెలిసిన వారు కూడా ఆ విషయాన్ని అంతగా గమనించలేదు. ఆదివారం ఇది సాక్షి కంట పడింది.

1952లో కాంగ్రెస్ అభ్యర్థిగా కడప శాసనసభ స్థానం నుంచి కోటిరెడ్డి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి, ఇండిపెండెంట్ అభ్యర్థి పుల్లగూర శేషయ్యపై 53 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రకాశం పంతులు క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పని చేశారు. 1955 సార్వత్రిక ఎన్నికల్లో లక్కిరెడ్డిపల్లె నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి, సీపీఐ అభ్యర్థి ఆలంఖాన్‌పల్లెకు చెందిన జి.పెద్దిరెడ్డిపై 6049 ఓట్లతో కోటిరెడ్డి గెలుపొందారు. 1964లో ఆయనను శాసనమండలి సభ్యునిగా గవర్నర్ నామినేట్ చేశారు. 1970 జూన్ 3వ తేది వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఈ వివరాలన్నీ ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ పరిశీలిస్తే తెలుస్తాయి. 1980 మార్చి 15వ తేది నాటి భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కడప పర్యటనకు వచ్చి కోటిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ సమయంలో కోటిరెడ్డి జీవించి ఉన్నారు గనుకే విగ్రహం వద్ద జనన, మరణాలను సూచించే శిలాఫలకాన్ని ఏర్పాటు చేయలేదు. పాత విగ్రహాన్ని చూసిన ఎవరికైనా ఈ విషయం గుర్తుండే ఉంటుంది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప నగరంలోని కూడళ్లు, రహదారుల అభివృద్ధి పనులు జరిగాయి. ప్రజా ప్రతినిధులు, పౌరసమాజాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా.. అంతా తానే అన్నట్లు వ్యవహరించారనే విమర్శలున్న నాటి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో ఈ పనులన్నీ జరిగాయి. ఇందులో భాగంగా అప్పటికే ఉన్న కోటిరెడ్డిసర్కిల్ వద్ద మరికొంత అభివృద్ధి పనులు చేశారు. కోటిరెడ్డి జనన, మరణాలను తెలిపే శిలాఫలకాలను విగ్రహానికి నాలుగు వైపులా ఏర్పాటు చేశారు. ఆయన జనన, మరణాల గురించి వారి కుటుంబ సభ్యులు, బంధువులు, నగర ప్రముఖులు ఎవరితోనూ సంప్రదించలేదు. కోటిరెడ్డికి సంబంధించిన పుస్తకాలు, కనీసం వికీపీడియా చూసి తెలుసుకోకుండా 1957 జనవరి 27న మరణించారని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

స్వాతంత్య్ర యోధుల పట్ల నిర్లక్ష్యం

నగరంలో కొత్త కూడళ్లు ఏర్పాటు చేస్తున్నందున జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన తొలి స్వాతంత్య్ర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అపరదాన కర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ విజయరామరాజు, అప్పటి కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. విగ్రహాలు ఏర్పాటు చేస్తే ఎవరు నిర్వహణ చేస్తారు? అభిమానాన్ని గుండెల్లో దాచుకోవాలే తప్ప విగ్రహాలు ఎందుకు? జయంతులు, వర్ధంతులు వస్తే అన్నదానాలు చేయండి అంటూ మాట్లాడారు. కూడళ్లు, డివైడర్ల వద్ద చిరుతలు, పక్షులు, ఉడతలు, ఎవరికీ అర్థం కాని బొమ్మలు ఏర్పాటు చేశారు.

చరిత్ర తెలుసుకోకుండా..



స్వాతంత్య్ర యోధుల విగ్రహాలు ఏర్పాటుచేసే సమయంలో వారి చరిత్ర కనీసం అధికారులు తెలుసుకోవాలి. కోటిరెడ్డి గురించి తెలుసుకోకుండా ఏ ఆధారాలతో శిలాఫలకంపై ఆయన మరణ తేదీని రాశారో చెప్పాలి. ఇది ఆయనకు తీవ్ర అపచారం చేయడమే అవుతుంది. కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ శివశంకర్ స్పందించి స్వాతంత్య్ర దినోత్సవ సమయానికైనా ఈ తప్పును సరిదిద్దాలి.

– సీఆర్‌వీ ప్రసాద్‌రావు,
జిల్లా హేతువాద సంఘం అధ్యక్షులు, కడప

ఇది క్షమించరాని నేరం



జిల్లా స్వాతంత్రోద్యమంలో కడప కోటిరెడ్డి కీలకపాత్ర పోషించారు. అలాంటి వ్యక్తి విగ్రహం వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేసే సమయంలో కనీస సమాచారం తెలుసుకోవాలి. అలా కాకుండా తప్పుడు సమాచారంతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమవుతుంది. ఇందుకు బాధ్యులైన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్,
సీపీఎం జిల్లా కార్యదర్శి, కడప